చేతిరాతతో మారనున్న గీత


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- ఉత్తీర్ణతలో దస్తూరికి ప్రాధాన్యం
- అందంగా రాస్తే.. మంచి మార్కులు

గరుగుబిల్లి: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులు ధ్యాసంతా చదువుపైనే... కానీ చేతిరాతపై దృష్టి పెట్టేవారు కొందరు మాత్రమే. పరీక్షలలో సమాధానాలు ఉన్నది, ఉన్నట్లు రాసినా... దస్తూరితో ఎంత బాగా రాసామన్నదే ముఖ్యం. సమాధానం ఏమి రాసామన్నది పేపర్ మూల్యాంకనం చేసే ఉపాధ్యాయుడుకి అర్థమైతే ఎక్కువ మార్కులు వేసేందుకు అవకాశం వుంటుంది.

దస్తూరికి ప్రాధాన్యత..

పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో దస్తూరికీ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొనడంతో దస్తూరీని పెంపొందించేందుకు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం కోసం ఉదయం, సాయంత్రం సమయాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఏడాది పాటు నేర్చుకున్న అంశాలను రెండున్నర గంటలలో కాగితంపై పెట్టి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలి. స్పష్టంగా ఎలాంటి కొట్టివేతలు లేకుండా ముత్యాలాంటి అక్షరాలతో ప్రశ్నలకు జవాబులు రాయాల్సి వుంటుంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి చేతిరాతపై నిలిచింది.

సాధనతో ఫలితం..

ఇప్పటివరకు సరిగా రాయకపోయినా, రాసే విధానం మార్చుకోవాలంటే నిత్యం సాధన చేయాల్సిందే. తొమ్మిదో తరగతి వరకు దస్తూరి ఎలా వున్నా పదో తరగతి ప్రారంభం నుంచి దృష్టి సారిస్తే మంచి ఫలితం ఉంటుంది. నిత్యం నాలుగైదు పేజీలు రాస్తే దస్తూరి మెరుగవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తెలుగుతో పాటు ఆంగ్లం, హిందీ సబ్జెక్టులపై ఇదే విధానం అమలు చేయాలి. చదువుతూ రాయడం వల్ల జవాబులు బాగా గుర్తుండటంతో పాటు అక్షరాలు అందంగా రాయడం అలవాటు అవుతుంది.

ఇవి పాటించాలి..

సమాధాన పత్రంలో రాసే జవాబులు సూటిగా, అక్షరాలు పొందికగా వుంటే పేపరు మూల్యాంకనం చేసే వారు మార్కులు పూర్తి స్థాయిలో వేసే అవకాశం వుంటుంది. పేజి పైభాగంలో ఒక అంగుళం, ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్ విడిచిపెట్టాలి. సామాన్య, భౌతిక శాస్త్రాలలో బొమ్మలు గీసి భాగాలు గుర్తించే విషయంలో పెన్నును వత్తిపెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపరు వెనుక భాగం పాడవుతుంది. పేజీలలో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుసలో వుండాలి. పేజీకి పదహారు నుంచి ఇరవై లైన్లు మించి రాయకూడదు. రోజు కొద్దిసేపు సాధన చేస్తే పరీక్షలలో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు. పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే, రాసే అక్షరాలు మనకు కనిపించడంతో పాటు గుండ్రంగా ఉంటాయి. జవాబు రాసేటప్పుడు అట్టపైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు కూర్చుని రాయడం మంచిది. అక్షరాలు, పదాలు వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉంచాలి.

చేతిరాతతో మార్కులకు భరోసా

ముత్యాల్లాంటి అక్షరాలతో మార్కులకు ఢోకా ఉండదు. చేతిరాత మెరుగు పరిచేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. సమాధానాలు మూల్యాంకనం చేసే అవకాశం లేకపోతే విద్యార్థులు నష్టపోతారు. తక్కువరాసినా తప్పులులేకుండా అందంగా రాయడం వల్ల ఆకట్టుకొని మార్కులు సాధించవచ్చు.
– జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, రావివలస

చేతిరాతకు ప్రాధాన్యతనివ్వాలి

శాస్త్ర సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంటుంది. సంబంధిత భాషపై పట్టు వుంటే రాయడం తేలికవుతుంది. దస్తూరి బాగున్న విద్యార్థులకు అదనపు మార్కులు పొందే అవకాశం ఉంటుంది. అన్నీ పాఠశాలలో ఈ విధానం ద్వారానే విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం.
– దత్తి అప్పలనాయుడు, ఎంఈఓ, గరుగుబిల్లి

క్లుప్తంగా

సంతాపం

భామిని: మండలంలోని లివిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బౌరి త్రినాథ్ (55) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. త్రినాథ్ భార్య సాధామిని సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. సంతాపం తెలియజేసిన వారిలో పార్టీ నాయకులు గెల్లంకి రమేష్, కాగితాపల్లి కృష్ణారావు, గాడో ఆఫీస్, పాందర భీష్మా, గాడో కృష్ణారావు, తదితరులున్నారు.

చెట్టు తొలగింపు

- సాక్షి ఎఫెక్ట్..


జేసీబీతో చెట్టు తొలగింపు పనులు

భామిని: మండలంలోని గజపతినగరం ఏబీ రోడ్డుపై కూలిన భారీ వృక్షాన్ని బత్తిలి పోలీసులు గురువారం తొలగించారు. 'రోడ్డుపై కూలిన చెట్టు' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి ఎస్సై అనిల్‌కుమార్ స్పందించారు. పీసీ పీవీ రమణ సారథ్యంలో జేసీబీ తీసుకువచ్చి చెట్టును తొలగించడంతో, వాహన రాకపోకలు సులువుగా సాగాయి.

పీ 4 సర్వేపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ–4) సర్వేపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సర్వేపై ఎంపీడీఓ బి. వెంకటరమణ పలు సూచనలు చేశారు.

మహిళా శక్తి చాటి చెప్పాలి


నినాదాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది


పాలకొండ రూరల్: మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉంటూ తమ శక్తిని చాటి చెప్పాలని సీడీపీఓ బి.సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం సెక్టార్ సిబ్బందితో కలిసి గురువారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. సమాజంలో మహిళల అభ్యున్నతికి పొందుపరిచిన చట్టాలు, హక్కులు, ఉపాధి అవకాశాలు, అన్ని రంగాల్లో రిజర్వేషన్లు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు దశారత్నం, టి.మేరీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన అవసరం


విద్యార్థినులకు సూచనలు చేస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్: విద్యార్థినులు తమ ఆరోగ్య రక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ నాగశివజ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ సంబంధిత ఆరోగ్య ఇబ్బందులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎం. శ్యాంబాబు మాట్లాడుతూ.. సమాజంలో కీలక భూమిక పోషించే మహిళలు ఆరోగ్యపరంగా మరింత పటిష్టంగా ఉండేందుకు అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిణులకు ఉచిత వైద్య పరీక్షలు చేపట్టారు. అనంతరం జీసీటీఏ డైరీ ఆవిష్కరించారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు


రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ డీఈ తిరుపతి నాయుడు తెలిపారు. గతంలోని ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరైందని, ఆ నిధులతో ప్రస్తుతం 800 మీటర్ల మేర రోడ్డు వేసేందుకు గురువారం మార్కింగ్ పనులు చేపట్టామన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించి, పూర్తి చేస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ తిరుపతిరావు

జియ్యమ్మవలస: సైబర్ నేరాల బారినపడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ టీవీ తిరుపతిరావు సూచించారు. మండలంలోని పెద మేరంగి కూడలిలో ఉన్న తిరుమల సాయి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఓటీపీని ఎవరికీ చెప్పవద్దన్నారు. అలాగే గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి వాటిని అలవాటు చేసుకోవద్దన్నారు. అలాగే ఆకతాయిల బారి నుంచి ఎలా తమను తాము రక్షించుకోవాలో విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో చినమేరంగి ఎస్‌ఐ అనీష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయండి

- ఎంపీడీఓ రంగారావు


మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగారావు

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలో ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలు నిర్దేశించేందుకు చేపడుతున్న పీ–4 సర్వే సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ వీవీ.రంగారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీ 4 సర్వేతో పాటు ఇతర సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వెలగవాడ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. వేసవి నేపథ్యంలో ఉదయం 11 గంటల్లోపు.. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పనులు జరుగుతున్న చోట తాగు నీరు, టెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నేడు సిరుల ఎల్లమ్మ, పోతన్న జాతర


పాలకొండ: పూజలందుకుంటున్న ఎల్లమ్మ

పాలకొండ: నగర పంచాయతీలో సిరుల ఎల్లమ్మ, పోతన్న జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు సిరుల పోతన్న వీధిలో గల ఎల్లమ్మ ఆలయంలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఆదివారం వరకు జరగనున్న ఈ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. భక్తులు వేకువజామునే స్నానాలాచరించి, జోగి దండి అనంతరం ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పోతన్న వీధికి వెళ్లే రహదారిలో బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించేందుకు చర్యలు తీసుకున్నారు.

– నేరడిలో..

భామిని: మండలంలోని నేరడి – బి గ్రామంలో వెలిసిన సిరుల ఎల్లమ్మ జాతర శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటే చెవి, చర్మ సంబంధిత వ్యాధులు దరి చేరవని భక్తుల నమ్మకం. ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుంటారు.

మహిళల ర్యాలీ



ర్యాలీకి సిద్ధమైన ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు

గుమ్మలక్ష్మీపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి రావాడ జంక్షన్ వరకు మహిళలు గురువారం ర్యాలీ నిర్వహించారు. అన్ని రంగాల్లో రాణించేలా మహిళలను ప్రోత్సహించాలని, మహిళా సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, మహిళలపై వివక్ష చూపొద్దని, పురుషులతో సమానంగా ఆడవాళ్లను చూడాలని వారు నినాదాలు చేశారు.

కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి, సూపర్‌వైజర్లు భవాని, జానకి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ప్రమాదాలను అధిగమిద్దాం

- సీఐ ఎం. చంద్రమౌళి


అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలపై సంపూర్ణ అవగాహనతో రోడ్డు ప్రమాదాలను అధిగమించవచ్చని స్థానిక సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో, ఇతర వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు తమ వాహనాల ఫిటినెస్‌తో పాటు ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను, సరుకులు ఎక్కించడం సరికాదాన్నారు. మితిమీరిన వేగం, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. పోలీసుల సూచనలు కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు. సమావేశంలో ఎస్సై కె.ప్రయోగమూర్తి, ఏఎస్సై నారాయణరావు, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో మూడు రోజులుగా జరుగుతున్న ఎల్లమ్మ జాతర మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. పెద్దసంఖ్యలో భక్తులు జాతరకు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఎల్లమ్మ పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర


అమ్మవారి జాతరలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని ఖడ్గవలస గ్రామంలో ఎల్లమ్మ జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారిని వనంగుడి వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ క్రమంలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని, విశేష పూజలు చేశారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


విద్యార్థులకు హెచ్‌బీ టెస్ట్ చేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.వరం ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం రక్త పరీక్షలు చేశారు. హెచ్‌బీ(హిమోగ్లోబిన్) శాతం నమోదు నిమిత్తం ఈ పరీక్షలు చేశామని, రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. మనం తినే రోజువారీ ఆహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలని తెలిపామన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహ స్వామికి ముడుపులపూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామికి భక్తులు గురువారం ముడుపుల పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన పూజా కార్యక్రమం నిమిత్తం దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆలయ ప్రాంగణంలో క్యూకట్టి ముడుపుల పూజలు అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని మైదానంలో వాలీబాల్ క్రీడా పోటీలను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు గురువారం ప్రారంభించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. అనంతరం క్రీడాపోటీల్లో పాల్గొనే జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తి కనబరచాలని కోరారు. క్రీడల్లో ఎంతో మంది రాణించి ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను కూడా నిరుద్యోగ యువతకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ హరి, ఎస్‌ఐలు శివప్రసాద్, నారాయణరావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు తప్పనిసరి..


ప్రస్తుత సీజన్‌లో జీడి, పామాయిల్ సాగులో సంబంధిత రైతులు అధికారులు సూచించిన మెలకువలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మండలంలోని జంపరకోట పంచాయతీ పరిధిలోని రైతులకు సీజనల్ పంటల సాగుపై కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త శ్రీనివాసరాజుతో కలిసి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీడపీడల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. - పాలకొండ రూరల్

మహిళా దినోత్సవం..


అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ భవానీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారంగా ఏర్పడి మహిళలకు అండగా ఉంటామని నినాదాలు చేశారు. బీసీఓ వరలక్ష్మి, ఎస్ఓలు జ్యోతిలక్ష్మి, సబితా పటా్నయక్, కార్యకర్తలు పాల్గొన్నారు. - భామిని

కలుషితనీరే దిక్కు ..


సీతంపేట మండలం రోలుగుడ్డి గిరిజనులు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. రక్షిత మంచినీటి ట్యాంక్‌ను శుభ్రపరచకపోవడంతో నీరు కలుషితమవుతోందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి క్లోరినేషన్ చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. - సీతంపేట

రక్తహీనత నివారణపై దృష్టిసారించండి


సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

కొమరాడ: రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురంలో నిర్వహిస్తున్న ఎఫ్‌డీపీ కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని, కాసేపు మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లోని గర్భిణులు రక్తహీనత బారినపడడానికి మలేరియా క్రిమి కూడా ఓ కారణమేనన్నారు. ఆ క్రిమి ప్రధానంగా ఎర్రరక్త కణాలపై దాడి చేస్తుందని, దాంతో రక్తహీనత బారినపడతామన్నారు. అందరూ ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా దోమలకు ఆవాసమైన మురుగునీటి నిల్వలను తొలగించుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం పక్కాగా నిర్వహించి, పరిసరాలు పొడిగా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యులు అరుణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు


వృద్ధుడి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గౌరీపురంలో శ్రీకాకుళం జిల్లా, రాగోలు జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యం సౌజన్యంతో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి హాజరైన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రానున్న వేసవి కాలంలో వడదెబ్బ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి


ఫారంపాండ్‌లను పరిశీలిస్తున్న ఉపాధి హామీ పథకం పీడీ రామచంద్రరావు

కొమరాడ: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేపడుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆ పథకం పీడీ కె.రామచంద్రరావు కోరారు. మండలంలోని గిరిశిఖర గ్రామమైన పెదశాఖ పంచాయతీ, పూసనంది గ్రామంలో జరుగుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. మండలంలో మొత్తం 240 ఫారంపాండ్‌ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకుంటే వాటిలో 120 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. అలాగే మరో 650 నిర్మాణాలు చేయాలని ఏపీవో బాలకృష్ణను ఆదేశించారు. వేతనదారులందరికీ పనులు కల్పించాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.